

# పట్టు చొక్కా

శ్రీ జానకిరాం

"అమ్మా!"

"ఆఁ"

"ఎల్లుండి పండుగే!"

"అవును నాయనా!"

"ఏం పండుగే?"

"సంక్రాంతి పండుగురా!"

"అయితే నాకు కొత్త బట్టలు కొనవూ?"

"ఏం బట్టలు కావాలి?"

"మేస్త్రీగారి రామంకు ఉంది కదూ చొక్కా ఆలాంటిదే!"

"అది పట్టుచొక్కా నాయినా! అది కొనడానికి యెక్కువ డబ్బులు ఉండాలె, సాదా చొక్కా కొంటాను"

"ఊఁహుఁ— నాకు పట్టు చొక్కాయే కావాలె"

"వద్దు. దానివంతు రెండు పచ్చ చొక్కాలు కొంటాను అల్లరి చెయ్యకు బాబూ!"

"అయితే నాకేపీ వొద్దులే! పోనీ! ఎప్పుడూ ఈలాగే అంటావు."

"సరే! కొంటాను. అన్నం తిందువుగాని రా"

"పట్టుచొక్కా కొంటానంటేనే కాని నేను అన్నం తినను"

"రేపు జీతం అందుతుంది. తప్పక కొంటాను"

*　　*　　*

"అమ్మా"

"ఆఁ—"

"నీవు మరి అన్నం తినలేదేం?"

"ఆకలి వేయలేదు నాయనా?"

"ఏమీ?"

"తల నొస్తోంది"

"అన్నీ అబద్ధాలే! ఏది నేను చూస్తాను?"

"రాత్రి చాలా అయింది. ఇక పడుకో బాబూ! నీకు రేపు సాయంత్రం వచ్చేటప్పుడు పట్టు చొక్కా తెస్తానుగా"

"అలాగే అమ్మా! మంచిది తేవాలె"

ఎనిమిది ఏళ్ల కొడుకును. ఆ విధంగా ఓదార్చి, సుందరమ్మ చాప మీద పడుకొన పెట్టింది.

సుదరమ్మ చాల గౌరవం కుటుంబానికి చెందినమనిషి. కాని బీదతనం ఆమెను బాధిస్తూంది. ఆరు సంవత్సరాల క్రితం వచ్చిన మశూచి జాడ్యంలో భర్త చనిపోయాడు. అప్పటికి రెండేండ్ల కొడుకుని పెట్టుకొని కాలక్షేపం చేస్తూంది. ఆ పిల్లవాని సౌఖ్యమే తన సౌఖ్యం అని తలంచుకొంటూ, కష్టాలు మర్చిపోయి జీవనం గడుపుతూంది.

అక్కడకు రెండు మైళ్లదూరంలో ఉన్న "లక్ష్మీరైసుమిల్లు" లో, రోజుకు ఆరు అణాలు కూలిమీద పనిచేస్తూంది. ఉదయం ఏడుగంటలు మొదలు పండ్రెండువరకు, మధ్యాహ్నం ఒంటి గంటమొదలు నాలుగు గంటలువరకు పనిచేయాలె. ఆదివారం పనిచేస్తే ప్రతిశనివారం సాయంత్రం రెండురూపాయిల నాలుగణాలు దొరికేవి. లేదా ఒక్కొక్కప్పుడు ఏమయినా ఆలస్యం అయిందా, ఆ ఆరురోజుల్దీ మొత్తం చేసి, ఆలస్యానికైన డబ్బు, మినహాయించగా మిగతాది దొరికేది. సుందరమ్మ ఉన్న యిల్లు మిల్లుకు దూరం అవటంచాత, ఈఆరు రోజుల్లో రెండు మూడు గంటలు ఆలస్యం అవుతూండటం, అందుకని, అణా, బేడ జీతం తక్కువ దొరుకుతూండటం మామూలు. అదనంగా ఇంటి అద్దె, ఇంటిపన్ను, దొడ్డిపన్ను వగైరాలు యిచ్చుకుంటూ చాల ప్రయాసంతో వారం అంతా ఆ కొద్ది జీతంతోనే గడుపుతూండేది.

ఆదినం ఇంట్లో కొంచెం బియ్యం ఉంటే అన్నంవండి కుమారునికి పెట్టింది. తాను పస్తుపడి ఊరుకుంది. ఆ పిల్లవాడు ప్రశ్నించి నప్పుడు ఆకలివేయలేదని, తలనొస్తూందని సమాధానం చెప్పింది. కాని అన్నం కొంచెం మిగిలేఉంది. అది ఉదయం వానికి అని ఉంచివేసింది.

నాడు శనివారం. సుందరమ్మ మిల్లు పనికి బయలుదేరింది. శక్తిలేక పోవటంచాత చాల ప్రయాసంతో నడక సాగిస్తూంది, ఎలాగో కాలానికి చేరుకుంది.

దినమంతా పనిచేసి సాయంత్రం ఆఫీసుదగ్గరకు వెళ్లింది తోటివాళ్ళతో జీతం పుచ్చుకోటానికి, ఒక్కొక్కరూ జీతం అందుకుంటూ వెళ్లిపోతూన్నారు. 'సుందరమ్మా' అన్న పిలుపు వినవచ్చింది. "హాజరు బాబూ!" అంటూ కిటికీ దగ్గరకు వెళ్లింది. గుమస్తా పుస్తకంచూచి ఈలా అన్నాడు. "సోమవారం 15 నిముషాలు, మంగళవారం, 28 నిముషాలు, బుధవారం 25 నిముషాలు ఆలస్యంచేశావు. లక్ష్మీవారం నాడు మధ్యాహ్నం పడుకొన్నందుకు 2 అణాలు జరీమానా. శుక్రవారం తిరుగా 12 నిముషాలు ఆలస్యం. ఇంటి అద్దె 4 అణాలు. ఇంటిపన్ను, దొడ్డిపన్ను 2 అణాలు. ఇవి అంతా మినహాయింపగా నీకు రావలసింది ఒక రూపాయి పదకొండు అణాలు."

ఈమాటలు విని సుందరమ్మ, "బాబూ! ఒంట్లో ఆయాసంచాత లక్ష్మీవారంనాడు నాలుగైదు నిముషాలు కూచున్నాను. అంతేకాని నిద్రపోలేదు. ఒక్కసారి రెండు అణాలు జరీమానావేసినారు; బీద దానిను—" అని అంటూండగా "చాలు! ఇక్కడ అట్టే బెకబెకలాడకు. ఇంద తీసుకో" అని గుమస్తా రూక్షంగా పలికి, సొమ్ము అందించాడు.

"క్షమించండి బాబయ్యా! పైసా ఒల లక్షగాఉంది. నా బ్రతుకు—"

"చెప్పితే వినిపించదూ! తిరిగి మాటాడి నావంటే పావలా జరిమానా తప్పదు"

"పోనీ తండ్రీ! అంతకోపం ఎందుకు? ఈ కోత డబ్బులు, వచ్చే వారం జీతంనుంచి, మినహాయింపించండి. ఈవారంలో సంక్రాంతి; అదనంగా ఖర్చులుంటాయి. పూరా జీతం యిప్పించండి"

"హుఁ! నీ మొఖానికి సంక్రాంతి ఒకటా! తీసుకుంటావా? తీసుకోవా?"

"బా!-"

"ఛీ! పో! నీకు జీతంలేదు గీతం లేదు. నీతో అనవసర ప్రసంగం కలిగించుకోటానికి నాకు తీరుబాటు లేదు" అంటూ ఆడబ్బు పెట్టెలో

పనేసి తరువాత మనిషిని పిల్చినాడు.

గుమాస్తా ప్రవర్తనచూచి సుందరమ్మకు బెంగవేసింది. ఆ సొమ్ము అయినా యివ్వకుండా ఉంటాడేమో అని భయపడి పోయింది. కొంచెం ధైర్యం చేసుకొని "గుమస్తా బాబూ! పోనీ ఆడబ్బు అయినా యిప్పించండి" అని అడిగింది.

"ఛో అవతలకు! జీతం ఇవ్వటానికి వచ్చేసరికి అడ్డదిడ్డంగా మాట్లాడి, ప్రాణాలు తీస్తావు"

"మరేలా మేబూ! బీదవాళ్ళం. ప్రభువులు కటాక్షిస్తారని కష్ట సుఖాలు చెప్పుకుంటాం"

"కష్టసుఖాలు! హుం-పనిలోనికి ఆలస్యంగా వస్తూండాలె; విశ్రాంతి కావాలె; పడుకొంటూండాలె; పూరాజీతం దొరుకుతూండాలె;ఆలా అవటానికి, మిల్లు నీ అబ్బగారిదా?"

ఆ మాటలు వినేసరికి సుందరమ్మకు అంతులేని దుఃఖం కలిగింది. ఆమిల్లు తన అబ్బగారిదో, అమ్మగారిదో అయిఉంటె, తన కెందుకాస్థితి వస్తుంది? అయ్యో! ఆరు రోజుల్లోనూ, ఒకగంట ఆలస్యంగా వస్తే దానికి డబ్బు కోసేయడమా? దినమంతా పనిచేస్తే ఆరు అణాలు జీతం ఐదు నిముషాలు విశ్రాంతి తీసుకుంటే రెండణాలు జరీమానా! ఏం న్యాయం? ఈ న్యాయం అంతా కూలి ప్రజలపట్లేనా? మరెవ్వరికీ లేదా? ఈ కూలి ప్రజలు తమ రక్తాన్ని చెమటగాచేసి, ఈ కర్మాగారాలు, యంత్రశాలలు మొదలైనవి నడుపు తూన్నారుగాని అధికారులం అనుకున్నవారు ఏమాత్రం కష్టిస్తున్నారు? ఆకూలి ప్రజలవల్లనే కదా వీరలు వందలు, వేలు జీతాలు నెల వచ్చేసరికి పొందుతున్నారు? ఆలాంటి వాళ్లకా యీశిక్షలు? ఈ జీతాలు తగ్గించడాలు? ఈ జరీమానాలు? సమయంవస్తే, కర్మాగారాధికారులకు నష్టాలు వస్తూన్నదని మనుష్యుల్ని పనుల్లోనుంచి తప్పించడాలు?......

తనిఖీదార్లు, మేనేజర్లు, మాగుస్తా బాబులు, దినానికి ఎన్నిగంటలు పనిచేస్తున్నారు? త్రికరణ శుద్ధిగా ఈ ఎనిమిది గంటల్లోనూ నాలుగు గంటలైనా చేస్తున్నారా? వాళ్ళ వాళ్ళ ఆఫీసులకు ఎన్నిగంటలు ఆలస్యంగా వస్తున్నారో? ఎన్నిగంటలు విశ్రాంతి తీసుకుంటున్నారో? తెలీదా! ఎవరికీ తెలియకపోయినా వారి ఆత్మలకు తెలీదా? వాళ్లకే జరీమానాలూ లేవా? వాళ్లకే శిక్షలూ లేవా? వాళ్ళకే తగ్గింపులూలేవా? ఏంవంటే వారు పెద్ద పెద్ద దొరలు-మేనేజర్లు-తనిఖీదార్లు గుమాస్తా బాబులున్నా? ఏం వచ్చినా, ఏ విధంగాచూచినా ఈ కూలీ ప్రజలకేనా ఇవన్నీన్ని?... సరే! ఇదంతా కాలమహిమ! ఒకర్ని అనవలసిన పనేముంది?

ఈలా తలంచుకుంటూ, సుందరమ్మ అచ్చటనే నిలుచుండిపోయింది కాస్సేపటికి అందరి జీతాలు యివ్వడం పూర్తిఅయింది. తిరుగా సుందరమ్మ కిటికీ చెంతకువెళ్లి "బాబూ! జీతం యిప్పించండి" అంది.

"మొదటే కిక్కురు మనకుండా తీసుకుంటే ఈ అవస్థ ఎందుకు" అంటూ గుమస్తా ఆడబ్బు యిచ్చివేసి, పుస్తకంలో ఆమె వ్రేలి ముద్ర తీసుకొన్నాడు.

౭

సుందరమ్మ తన దుర్భాగ్యాన్ని నిందించుకుంటూ బజారువేపు బయల్దేరింది. కుమారుడు కొనమన్న పట్టు చొక్కా విషయమై దుకాణాలు చూడ సాగింది. అక్కడ అనేక రకాల బట్టలు అద్దాల బీరువాల్లో చక్కగా అమర్చబడిన ఒక పెద్ద దుకాణం చెంతకు వెళ్ళింది. పైని కఱ్ఱ దండెముల మీద ఇనుప వంకీల లోను కొన్ని తయారయిన చొక్కాలు, కమీజులు, సూట్లు, మొదలైనవి ఉన్నాయి. ఒక పట్టు చొక్కావేపు వ్రేలు చూపిస్తూ" సెట్టిగారూ! దాని ఖరీదెంత?" అని ప్రశ్నించింది. ఆ వర్తకుడు ఆమెను ఎగాదిగాచూచి "ఓహో! నీవేషానికి పట్టుచొక్కా ఒకటా? దొంగ ముండలాగున్నావు! ఛో ఛో" అనితిట్టి గసిరివేశాడు. ఆ మాటలు విని

సరికి ఆమెకు ఎక్కడలేని అభిమానం వచ్చింది. వెంటనే వేరొక్క దుకాణం దగ్గరకు వెళ్లి, అక్కడ ఉన్న ఒక పట్టుచొక్కా తీసి, ఖరీదు అడగ బోతూంటె, ఆ కొట్టులో పనిచేస్తూన్న ఒక మొఱటు కుర్రవాడు" అరే! దొంగ! దొంగ? పట్టుచొక్కా ఎత్తుకుపోతూంది'' అని కేకవేశాడు. యజమాని ఆమె చేతిలో చొక్కా లాక్కొని, త్రోవ పోతూన్న, పోలీసు జవాన్ని పిల్చి ఆమెను ఒప్పజెప్పినాడు. పాపం! సుందరమ్మకు నోటవెంబడిమాట వచ్చింది కాదు. ఆ పోలీసు, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా, ఆమెను గెంటుకుపోయి, నాలుగు ప్రహరించి వెళ్ళిపోయాడు. రెండు దినములై తిండి లేకపోవటంచాత ఆ దెబ్బలకు సుందరమ్మ సొమ్మసిల్లి, రోడ్డుప్రక్క పడిపోయింది. రెండు గంట లయాక కొంచెం తెలివివచ్చింది. అప్పటికి రాత్రి సుమారు పది గంటలైంది. తన పిల్లవాని విషయం తలపుకు వచ్చింది. ప్రొద్దున చాలీచాలని చలిది అన్నం తిన్నవాడు, అంత వఱకూ, యెలా ఉన్నాడో, తనకని ఎంతయెదురు చూస్తున్నాడో అని ఆమెమనస్సు బేజారు అయిపోయింది. వెంటనే ఇంటి ముఖంగా బయల్దేరింది. కాని పట్టుచొక్కా తీసుకొని వెళ్లకుండా ఉండటానికి ఆమె మనస్సు అంగీకరించిందికాదు. అయిన ఆలస్యం యెలా అయిందని తిరుగా దుకాణాల వేపు పోయింది. తానే కొట్టుదగ్గర దొంగ అని పట్టుపడిందో ఆస్థలం దగ్గరకేపోయింది. ఆ సమయాన ఎవరో ఒక గొప్ప ఇంటి ఆయన బట్టలు బేరంచేస్తూండటం చాత, కొట్టు యజమాని, నౌకర్లు పూర్తిగా పనిలో మునిగిఉన్నారు. సుందరమ్మచూచిన పట్టుచొక్కా, వేరుగా ఒక పెట్టెమీద పడి ఉంది. దానివేపు ఎవరి దృష్టిలేక పోవటం చూచి, ఆమె దానిని మెల్లగా సంగ్రహించింది. చటాలున మడతపెట్టి, ఒడిలో దాచివేసి అక్కడనుంచి వెళ్లింది. కాని నాలుగడుగులు వేసిందో లేదో అచ్చటనే నిలబడి పోయింది. పది నిముషాలపాటు ఆలోచించింది. ఏస్థలం నుంచి చొక్కాతీసిందో ఆస్థలంలో ఒక రూపాయ ఉంచివేసి వెనక్కు మళ్లిపోయింది. వడివడిగా నడక సాగించింది. కుమారుడు ఆచొక్కా చూచి ఎంత ఆనందిస్తాడో, ఆలేత హృదయం ఎంత ఉప్పొంగి పోతూందో అనుకుంటూ వెళ్తూంది. కాని పూర్తిగా రెండు దినముల నుంచీన్నీ, అన్నరసం అనేది నోటిలోకి వెళ్లకపోవటంచాత మొదటనే నీరసప్రాణం అవటం చాత, స్పృహతప్పి పడిపోయింది. తెల్లవార్లూ తెలివిరాలేదు. ఆరు గంటల ప్రొద్దుసరికి, చల్లటిగాలులు, మంచు, తగిలి తెలివి కలిగింది. పిల్లవాడిగురించి విచారించుకుంటూ, తడబడుతూన్న నడకతో ఇంటి ముఖం పట్టింది.

౩

ఆ దినం జమీందారుగారు వస్తారని, గ్రామం అంతా చాల సందడిగా ఉంది. అప్పటికప్పుడే త్రోవలు బాగుచేసి రంగు కాగితాలు అరటిచెట్లు కొబ్బరి ఆకులుకట్టి పందిళ్లతో అంతా అలంకరించారు.

ఏడున్నర గంటలయే సరికి బ్యాండు మేళాల్తో, గుఱ్ఱపు బగ్గీ మీద జమీందారు వస్తూన్నాడు. ఆయన్ని వరాలివ్వటానికని వస్తూన్న దేవుణ్ణి చూచేవిధంగా ప్రజలందరూ మిక్కిలి ఆదుర్దాతో చూస్తున్నారు. పెద్దవాళ్లకే అంత ఆత, తగా ఉంటే చిన్న పిల్లలసంగతి వేరే చెప్పాలా? అందరి పిల్లలతోపాటు సుందరమ్మ కొడుకుకూడా అకడికి వెళ్ళినాడు. కాని చిన్నవాడవటంచాత పిల్లలందరితోనూ వెనక్కు ఉండిపోయాడు. పెద్దవాళ్లు ముందుగా నిలబడిపోయి ఉన్నారు. సుందరమ్మ కుమారుడు మాత్రం ఏలాగో సందుచేసుకొని, ముందుగా వచ్చి నిలబడ్డాడు. అంతలో గుఱ్ఱపు బగ్గీ సమీపించింది. బగ్గీపోవటానికి కావలసినంత త్రోవ ఉన్నా జమీందారు నౌఖర్లు, జనాన్ని తమ లాఠీ

కట్టల్లో ఒత్తిడిచేస్తూ అధికారం చలాయిస్తున్నారు. అమాయకుడైన సుందరమ్మ కుమారుడు జవాన్లు అదమాయిస్తున్నా, ఆ ఉత్సవంచూచే అపేక్షతో, త్రోవ పక్కకువచ్చి నిలుచున్నాడు. అంత ఆ బగ్గీతోలినవాడు, తప్పుకోటానికి చోటు ఉన్నా, లక్ష్యంచెయ్యక "కదలరా వెధవా" అంటూ ఆపిల్లవానిని తనచేతిలో ఉన్న పొడవుపాటి కొరడాతో (కమ్చీ) కొట్టినాడు. ఆదెబ్బతో "అమ్మా" అంటూ ఆ అభాగ్యుడు పడిపోయాడు. వెంటనే బగ్గీ వానిమీదనుంచి పోయింది. ఇంకేముంది? ఆ బాలుని శవంచుట్టూ నల్గురూ మూగినారు. జమీందారుగారు మాత్రం "రాలుగాయ! అనుభవించాడు" అంటూ, మీసం పెనవేసుకుకుంటూ బగ్గీతో పోయారు.

సుందరమ్మ ఇంటికివస్తూ, దూరంనుంచే ఆ సమూహాన్ని చూచింది. ఏమిటో అనుకుంటూ, తూలుచూ, తూలుచూ, ఆ స్థలానికివచ్చింది. "ఎందుకు బాబూ! అలా మూగిపోయారు?" అని ఒకాయన్ని అడిగింది. "ఎవరో పిల్లవాడు, జమీందారుగారి బండి క్రిందపడి చచ్చిపోయాడు" అని అతడు చెప్పినాడు. సుందరమ్మకు గుండె ఝల్లుమన్నది తన పిల్లవాడేమో అని అనుమానం కలిగింది. దాంతో ఎక్కడలేని భయంవేసింది. ఒక్క దుముకున ఆ జనాన్ని చీల్చుకొని, మధ్యకు వెళ్ళింది. మరేముంది—రక్తంతో నిండిన కొడుకు శవం కనబడ్డది. "ఆ! నాయనా!" అంటూ, ఆశవంమీద పడిపోయింది. ఒడిలోని పట్టు చొక్కా ఆ పీనుగును కప్పింది.

అప్పుడా స్థలంనుంచి రెండు శవాలు- తల్లీ కొడుకుల్ది- కదిలినాయి.

—హిందీనుండి—


జగదేకరంభ

జగదేకరంభయన నీమెయే జగదేకరంభ. రంభఅంటే దేహ సౌందర్యముచేతనేగాక శీలసౌందర్యముచే ప్రపంచాన్ని మెప్పించిననారీరత్నము. చమత్కారమైన కథ.

గ్లేసు ప్రతి 1-కి 0-10-0 తపాలాఖర్చు వేరు:

మిత్రద్రోహము

తిన్నయింటికి వాసాలెంచు సామెతనుబట్టి యల్లబడిన రసవంతమగు నవల. ఇదివరకిట్టి నవల వెలువడలేదు. అపరాధాన్వేషణము అత్యద్భుతము. గ్లేసు ప్రతి 1-కి 0-8-0

తపాలాఖర్చు ప్రత్యేకము.

ధనలక్ష్మి కంపెని,
సౌకారుపేట, మదరాసు.

లీలా

లేక

సురేంద్రనగరమణి

రసవంతమగు నవలారాజము

బాలురకు తలితండ్రులయందు భక్తియు, స్త్రీలకు పతియందలి ప్రేమయు, పురుషులకు రాజవిశ్వాసమును యీ గ్రంథపఠనచే యలవడును.

ప్రతి 1-కి రు. 1-0-0

ఆర్య బుక్ డిపో,

19 తాండవరాయ మొదలివీధి, తిరువళ్ళికేణి, మదరాసు.